వచ్చారు



ఇచ్చారు



చదివారు



అరిచారు



ఒక్కసారి వచ్చిపో మాధవా..!

మాజీ ఎంపీ, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్‌కు విజయవాడ సైబర్ క్రైం పోలీసుల నుంచి 'ఆహ్వానం' అందింది. పోక్సో కేసు బాధితుల వివరాలను మీడియా సమావేశంలో బహిరంగపరిచినందుకు ఆయనపై గత ఏడాది నవంబరు 2న కేసు నమోదైంది. వైసీపీ హయాంలో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా పనిచేసి, ఆ తరువాత పార్టీని వీడిన వాసిరెడ్డి పద్మ ఆయనపై ఫిర్యాదు చేశారు. విజయవాడ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో భారతీయ నాగరిక్ సురక్షితా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్లు 72, 79 కింద నమోదైన ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఆయనకు గురువారం నోటీసులు అందజేశారు. విజయవాడ నుంచి గురువారం వచ్చిన పోలీసులు, గోరంట్ల మాధవ్ ఇంటికి వెళ్లి నోటీసులను అందజేశారు. మార్చి 5వ తేదీన విజయవాడకు వచ్చి తమ ఎదుట హాజరు కావాలని సూచించారు. 'వెళ్లాలా.. వద్దా..' అనేది తన న్యాయవాదులతో చర్చించి నిర్ణయించుకుంటానని మాధవ్ మీడియాతో అన్నారు. ఆ రోజు తన కార్యక్రమాల షెడ్యూల్ లేకపోతే వెళతానని, లేకుంటే గడువు కోరుతానని కూడా అన్నారు. 'మీరు మాజీ పోలీసు అధికారి కదా..? పోక్సో కేసు బాధితుల వివరాలను అలా ఎలా చెప్పారు..?' అని ప్రశ్నించిన మీడియా ప్రతినిధులపై అంతెత్తు ఎగిరారు. 'ఏ టీవీ..? ఏ మీడియా..? ఏ పత్రిక..?' అని ఎదురు ప్రశ్నలు వేశారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం


జిల్లాకు రూ.124.83 కోట్ల

పింఛన్ నిధులు

రేపు ఇళ్ల వద్దే పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ మార్చి నెలకు సంబంధించి ఒకటో తేదీన శనివారం ఉదయం 6గంటలకు గ్రామ-వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా అబ్ధిదారుల ఇంటివద్దకే అందజే యనున్నారు. మార్చి నెలకు సంబంధించి జిల్లాలో 2,82,119 మంది పింఛన్‌దారులకు రూ.124.83 కోట్లు మంజూరు చేశారు. శుక్రవారం బ్యాంకుల నుంచి పింఛన్ పంపిణీ సొమ్మును సిబ్బంది డ్రా చేసుకుని మార్చి 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేస్తారని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. మొదటి రోజే పింఛన్‌దారులందరికీ అందజేస్తారన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే రెండోతేదీ ఆదివారం సెలవు కావడంతో మూడో తేదీ సోమవారం పింఛన్ పంపిణీ పూర్తి చేస్తారని ఆయన వివరించారు.

అధికారం..!



జిల్లా ఉన్నతాధికారుల తీరుపై

ప్రజాప్రతినిధుల అసంతృప్తి

- చిన్నచిన్న పనులకూ సాకులు చెబుతున్నారని విస్మయం
- ఫైళ్ల పరిష్కారంపైనా నిర్లక్ష్యం
- సీఎం, మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు?
- బదిలీపై జోరుగా ప్రచారం

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న కీలక ఉన్నతాధికారుల తీరుపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, కీలక నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. తాము సిఫార్సు చేసినా.. ఏవేవో చెబుతూ తప్పించుకుంటున్నారని వారు ఆగ్రహంతో ఉన్నారు. చిన్నచిన్న పనులు కూడా చేయకుండా సాకులు చెబుతున్నారని రగిలిపోతున్నారు. పాలనాపరమైన విధానాల అమలు విషయంలోనూ చిత్తశుద్ధితో వ్యవహరించడంలేదనే ప్రచారం సాగుతోంది. ప్రభుత్వ పథకాల కన్నా సొంత ప్రాపకం కోసం ఉన్నతాధికారి ఆరాట పడుతుంటారనీ, తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు రావడంలేదనే భావన నేతలు వ్యక్తం చేస్తున్నారని చెప్పుకుంటున్నారు. బదిలీల సమయంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమకు అనుకూలంగా ఉండే అధికారులను తెచ్చుకుంటుంటారు. జడ్పీ, రెవెన్యూ శాఖల్లో తమకు అనుకూలమైన వారికి అవకాశం కల్పించాలని ప్రజాప్రతినిధులు ప్రతిపాదించినా వాటిని లెక్క చేయకుండా ఇష్టమొచ్చినట్లు పోస్టింగ్‌లు ఇచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ఆయా నియోజకవర్గాల్లో ఇప్పటికీ పాలనాపరంగా సరైన వ్యవహారాలు సాగడం లేదనే అసంతృప్తి ఎమ్మెల్యేలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విద్యాశాఖలో చేపట్టిన డెప్యుటేషన్ల వ్యవహారంలో ఉన్నతాధికారి వ్యవహరించిన తీరు నేతల మధ్య చిచ్చు రేపినట్లు చర్చలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ హయాంలో నోటిఫికేషన్ లేకుండానే అర్హత ఉందా, లేదా అని కూడా చూడకుండా డీఈఓ, ఎస్ఎస్ఏ ఆఫీసులకు టీచర్లను డెప్యుటేషన్‌పై వేసుకున్నారు. కూటమి పాలనలో జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాల నేతలు కొందరి పేర్లను ప్రతిపాదించినా.. వాటిని పట్టించుకోకుండా నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించి, వైసీపీ హయాంలో ఎస్ఎస్ఏ, డీఈఓ కార్యాలయంలో పనిచేసిన వారికే మళ్లీ అవకాశం కల్పించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై విద్యాశాఖాధికారులను అడిగితే తమకు సంబంధం లేదంటూ జిల్లా ఉన్నతాధికారిపైనే చెబుతున్నారని తెలిసింది. డీఈఓ ఆఫీసులో ఏఎస్ఓ నియామకంలోనూ జిల్లాకు చెందిన మాజీమంత్రి ప్రస్తుత సీనియర్ ఎమ్మెల్యే చెబుతున్నా.. విద్యాశాఖ అధికారులు కలెక్టర్ పేరు చెబుతూ.. ఇవ్వకుండా నాన్చుతున్నారని సమాచారం. ఇలా విద్యాశాఖ వ్యవహారాల్లో మొత్తం జిల్లా ఉన్నతాధికారి పాత్రే ఉన్నట్లు ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ వ్యవహారాలపై నేతలు ఆగ్రహంతో ఊగిపోతున్నట్లు సమాచారం.

ఫైళ్ల పెండింగ్‌పైనా...

ఆయన జిల్లా ఉన్నతాధికారి. క్షేత్రస్థాయితో పాటు జిల్లాస్థాయిలోనే వివిధ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ ఫైళ్లు పెండింగ్‌ఉండ కూడదని పదేపదే ఆదేశిస్తుంటారు. జిల్లా కీలక కార్యాలయంలో మాత్రం వేల ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయని సమాచారం. వాటి పరిష్కారానికి ఆ ఉన్నతాధికారి శ్రద్ధ చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. 10వేలకుపైగా వివిధ శాఖలకు సంబంధించిన ఫైళ్లు కీలక కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయనే చర్చలు వినిపిస్తున్నాయి.

సీఎం, మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు?

జిల్లా ఉన్నతాధికారుల వ్యవహారాలను సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు ప్రజాప్రతినిధులు, నేతలు తీసుకెళ్లినట్లు ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య కోల్డ్‌వార్ జరుగుతోందనీ, ఈ కారణంతోనే ఫైళ్లు కదలట్లేదని తెలుస్తోంది. పలు శాఖల్లో నియామకాల విషయంలోనూ అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉన్నవారికి ప్రాధాన్యమిచ్చారనీ, ఇలా అయితే స్థానికంగా తమకు ఇబ్బందులు తప్పవని జిల్లా నేతలు వాపోయినట్లు ఆ పార్టీ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు కీలక అధికారులు.. త్వరలో బదిలీ కాబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

తాగునీటి సమస్యల పరిష్కారానికి

ప్రాధాన్యం

నీటి వృథాను అరికట్టాలి

ఫోన్ ఇన్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్



ఫోన్ ఇన్‌లో పాల్గొన్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ తగిన చర్యలు చేపడుతున్నట్లు కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. ఆలిండియా రేడియోలో గురువారం తాగునీటి సమస్యలపై ఫోన్ ఇన్‌కార్యక్రమం నిర్వహించారు. పామిడి మండలం కొండాపురం ఎస్సీ కాలనీకి చెందిన నరేష్ మాట్లాడుతూ.. కాలనీలో 350 కుటుంబాలు ఉన్నాయనీ, ఫ్లోరైడ్ నీటితో కాళ్లు వంకర పోతున్నాయనీ, పంచాయతీ వాటర్ ట్యాంకు మూడురోజులకోసారి వస్తోందనీ, దీంతో పామిడికి వెళ్లి మినరల్ వాటర్ తెచ్చుకోవాల్సి వస్తోందనీ, సమస్య పరిష్కరించాలని కోరాడు. అలాగే అనంతపురంరూరల్‌మండలం ఏ.నారాయణపురంకు చెందిన సుధాకర్ మాట్లాడుతూ.. పాపంపేట, గణేష్‌నగర్‌కు నెలన్నరకు ఓసారి మంచి నీరు వస్తోందనీ, సమస్య పరిష్కరించాలని కలెక్టరుకు విన్నవించుకున్నారు. ఇలా దాదాపు 15మంది ఫోన్‌లో కలెక్టర్‌కు తాగునీటి సమస్యలను విన్నవించుకున్నారు. వాటి పరిష్కారానికి కలెక్టరు హామీలు ఇస్తూనే సూచనలు చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి మొదలైందనీ, తాగునీటి విషయంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ బాలరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురి మృతి

7

సర్వే పూర్తయ్యేనా?



అనంతపురంలోని కమలా నగర్‌లో సర్వేపై ఆరాతీస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)

నత్తనడకన ఎంఎస్ఎంఈ సర్వే

గడువు పొడిగించినా అదే తీరు

మిగిలింది.. 6 రోజులే..

నేటికీ 44.75 శాతమే పూర్తి

పలుచోట్ల సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల సర్వే సకాలంలో పూర్తి చేస్తారో..? లేదో.. అర్థంకాని పరిస్థితి నెలకొంది. పారిశ్రామికవేత్తలు, వ్యాపారుల వివరాలు సర్వేలో నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధిపొందే అవకాశం ఉంది. ఈ మేరకు గతేడాది నవంబరు ఆఖరు వారంలో ఎంఎస్ఎంఈ సర్వేకి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది జనవరి ఆఖరుకు పూర్తి చేయాలని తొలుత గడువు విధించారు. అప్పటికి కేవలం 37.26 శాతం యూనిట్లపై సర్వే చేశారు. ఫిబ్రవరిలో ఇప్పటిదాకా 44.75 శాతం యూనిట్లపై సర్వే చేశారు. ఈ నేపథ్యంలో మార్చి 5వ తేదీలోగా సర్వే పూర్తిచేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆరు రోజులే గడువు ఉంది. ఇప్పటిదాకా పలు ప్రాంతాల్లో సర్వే ఆశించిన స్థాయిలో ముందుకు కదలడం లేదు. ఆయా ప్రాంతాల్లోని కొందరు సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతోపాటు సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపమూ ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించకపోతే లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమనే వాదనలు వినిపిస్తున్నాయి. మరి ఏ మేరకు ఉన్నతాధికారులు దృష్టి సారిస్తారో వేచిచూడాల్సిందే.



జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయం

జిల్లా వ్యాప్తంగా 87,756 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా యూనిట్లను సర్వే చేయాల్సి ఉంది. ఇప్పటిదాకా 39,269 యూనిట్లను (44.75 శాతం) మాత్రమే సర్వే చేశారు. ఇందులో 27,044 యూనిట్లు వర్కింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. మిగిలినవి నాట్ వర్కింగ్ అని తేల్చారు. పలు ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది సర్వే చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు సమాచారం. మరికొన్ని చోట్ల వ్యాపారులు సహకరించపోవడంతో ఆశించిన స్థాయిలో ప్రక్రియ ముందుకు సాగడంలేదని తెలిసింది. వ్యాపారుల ఆధార్, పాన్, జీఎస్టీ, టర్నోవర్ ఇతర వివరాలు అడుగుతుండటంతో వాటిని ఇస్తే ఏమవుతుందోనన్న అనుమానంతో వ్యాపారులు జంకుతున్నట్లు సమాచారం. సర్వే మూలంగా కలిగే ప్రయోజనాలపై క్షేత్రస్థాయిలో వ్యాపారులకు తెలియజేయడంలో సంబంధిత అధికారులు శ్రద్ధ పెట్టకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

39,269 యూనిట్ల సర్వే

జిల్లాలో ఇప్పటి వరకు ఎంఎస్ఎంఈ సర్వే తీరిదీ..!

ప్రాంతం	సర్వే చేయాల్సిన యూనిట్లు	పూర్తయినవి..	శాతం
అనంతపురం	31,006	5,246	16.92
గుంతకల్లు	7,660	2,327	30.38
గుత్తి	2,666	890	33.38
కళ్యాణదుర్గం	3,123	1,053	33.72
రాయదుర్గం	4,043	2,768	68.46
తాడిపత్రి	6,912	6,912	100

ప్రయోజనాలివీ..

ఎంఎస్ఎంఈ పోర్టల్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక వేత్తల వివరాలు నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధి పొందే అవకాశం ఉంది. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సైతం చేస్తారు. సర్వేలో నమోదు చేసి న సంస్థల్లో అవసరమైన వాటికి స్టాండప్ ఇండియా, ఇతర పరిశ్రమల పథకాల ద్వారా ఆర్థిక సాయం అందిస్తారు. సంస్థలకు మార్కెటింగ్ సహాయం అందించేందుకు ఆలస్యమైన ఆర్థిక చెల్లింపుల సమస్యలు పరిష్కరిస్తారు. అవసరమైన సంస్థలకు జెడ్‌ఈడీ, ఐఎస్ఓ, 9000, ఐఎస్ఐ తదితర ధృవపత్రాలు పొందడంలో సాయం చేస్తారు. అర్హత కలిగిన యూనిట్లకు పారిశ్రామికవాడలు, ఎంఎస్ఎంఈ పార్కులు, కాంప్లెక్స్‌ల్లో ప్లాట్లు కేటాయించే అవకాశం ఉంది. ప్రభుత్వ పథకాల రూపకల్పనకు ఈ సర్వే ఉపయోగపడుతుంది. ఇంత ప్రాముఖ్యత కలిగిన సర్వేపై అధికారులు, సిబ్బంది.. వ్యాపారులకు అవగాహన కల్పించి, వందశాతం వివరాల నమోదు పూర్తి చేయాల్సి ఉండగా.. ఆశించిన స్థాయిలో సర్వే చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

గడువులోగా పూర్తికి చర్యలు



ఈ ఏడాది జనవరి ఆఖరులోగా సర్వే పూర్తి చేయాలని ఇదివరకు ఉన్నతాధికారులు ఆదేశించారు. సర్వే పూర్తికాకపోవడంతో గడువు పొడిగించారు. మార్చి 5వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ఆలోగా సర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

- శ్రీధర్, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి

రమణ.. లోడెత్తాడు..!



మద్యం గ్లాసుతో రమణారెడ్డి

రమణారెడ్డి మందు కొట్టాడు. అదేం పెద్ద విశేషమా..? అలవాటు ఉన్న అందరూ కొడతారు.. అనుకోకండి. ఆయన మందు కొట్టిన ప్లేస్ వేరే..! అనంతపురం నడిబొడ్డున..! కోర్టు సముదాయాల ఎదుట..! టూటౌన్, రూరల్, ట్రాఫిక్.. మూడు పోలీసు స్టేషన్‌ల ముందు బైకు నిలబెట్టి.. సైడ్ బ్యాగ్ నుంచి మద్యం బాటిల్, గ్లాసు బయటకు తీశాడు. అందులోకి మందు పోసి, వాటర్ ప్యాకెట్‌ను నోటితో కొరికి.. గ్లాస్‌లో పిండుకున్నాడు. ఈ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో బంధిస్తున్నవారికి 'చీర్స్' చెప్పి గటగటా తాగేసి, ఖాళీ గ్లాసును అక్కడ పడేసి.. రూరల్ పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లిపోయాడు.

ఏమైంది రమణా..?

ఆర్‌డబ్ల్యూఎస్‌లో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమణారెడ్డి, కుటుంబంతో కలిసి ఆలమూరు రోడ్డులోని పీవీకేకే కళాశాల ఎదుట నివాసం ఉంటున్నాడు. ఆయన భార్య ఝాన్సీ రాణి.. తన సోదరుడి పెళ్లి మార్చి 1, 2తేదీల్లో ఉండటంతో రెండు రోజుల క్రితం పుట్టింటికి వెళ్లారు. పిల్లలను తనతోపాటు పంపకపోవడంతో గురువారం మరోసారి వచ్చి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. భర్త ఒప్పుకోకపోవడతో రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రమణారెడ్డిని పిలిపించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద బైకును నిలబెట్టిన ఆయన.. మద్యం సేవించి విచారణను ఎదుర్కొన్నారు. ఈ వ్యవహారంపై రూరల్ పీఎస్ కానిస్టేబుల్ మనోహర్.. టూటౌన్‌లో స్పెషల్ రిపోర్ట్ ఇచ్చారు. కేసు నమోదు చేశామని సీఐ శ్రీకాంత్ తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

ఏపీ సీడ్స్ ఆస్తుల తాకట్టు..!

7

ఉష్ణోగ్రతలు



గరిష్ఠం	35.0
కనిష్ఠం	17.0



ఫ్రీ.. ఫ్రీ.. ఫ్రీ..!

రాయదుర్గం ప్యాలెస్ రోడ్‌లో ఓ కార్పోరేట్ కంపెనీ 'ఉచిత చికెన్ శిబిరం' నిర్వహించింది. చికెన్ వంటకాలు, ఉడికేసిన కోడిగుడ్లను పంపిణీ చేసింది. బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ కొనుగోళ్లు పడిపోవడంతో 'ఏమీ కాదు.. కావాలంటే తిని చూడండి' అన్నట్లు అవగాహన కల్పించింది. 'అవునా..? నిజమా..? ఏదీ చూద్దాం..' అని జనం ఎగబడటంతో తోపులాట జరిగింది. మహిళలు, చిన్నారులు సైతం క్యూలో నిలబడ్డారు. సరైన ఏర్పాట్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి.

-ఆంధ్రజ్యోతి, రాయదుర్గం

మట్టి తవ్వకాలను అడ్డుకున్న చంద్రదండు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అక్రమ తవ్వకాలపై ఆర్డీఓ ఆగ్రహం

పుట్లూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఎ.కొండాపురం శివారులోని కొండప్రాంతంలో మట్టి తవ్వకాలను సర్పంచు వనజమ్మ ఆధ్వర్యంలో చంద్రదండు నాయకులు గురువారం అడ్డుకున్నారు. ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లను నిలిపివేశారు. మట్టి అక్రమ తవ్వకాలతో ఎ.కొండాపురం, అరకటవేముల, సూరేపల్లి గ్రామాల పరిధిలో కొండలు కనుమరుగు అవుతున్నాయని చంద్రదండు రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని అన్నారు. తవ్వకాలు కొనసాగితే కొండపై ఉన్న కొండమీదరాయుడు స్వామి కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గాలిమరలు కూడా కూలిపోయే ప్రమాదం ఉందని అన్నారు. అనుమతుల పేరిట కొందరు ఇష్టానుసారం తవ్వకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. మరికొందరు అక్రమంగా తవ్వుతున్నా అధికారులు స్పందించకపోవడం దారుణమని అన్నారు. మట్టి తవ్వకాలకోసం ముందుగా గ్రామసభలు పెట్టి ప్రజాభిప్రాయం సేకరించాల్సి ఉన్నా, అధికారులు పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికైనా అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దారు శేషారెడ్డి, ఎస్ఐ వెంకటనరసింహం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాంట్రాక్టర్‌కు కేటాయించిన సర్వే నంబరును పరిశీలించారు. అనుమతులు లేనిచోట తవ్వుతుంటే ఏం చేస్తున్నారని సిబ్బందిపై ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటాయించినచోట మాత్రమే తవ్వుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మైనింగ్, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. కేటాయించిన విస్తీర్ణం కంటే ఎక్కువ తవ్వితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

న్యూస్ బాక్స్

సరిహద్దుకు చేరిన తుంగభద్ర జలాలు



మైలాపురం వద్ద కాలువలో ప్రవహిస్తున్న తుంగభద్ర జలాలు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాలు ఈ ఏడాది రెండోసారి జిల్లాకు చేరాయి. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి విడుదల చేసిన నీరు గురువారం జిల్లా సరిహద్దుకు చేరింది. కర్ణాటక దాటుకుని బొమ్మనహాళ్ సరిహద్దులోని 105 కి.మీ. వద్దకు తెల్లవారుజామున తుంగభద్ర జలాలు చేరుకున్నాయి. గుంతకల్లు బ్రాంచి కెనాల్ (జీబీసీ) ఆయకట్టులో పంటల పరిరక్షణకు మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు చొరవ చూపారు. వారి ప్రయత్నంతో కేసీ కెనాల్ వాటా నీరు 0.5 టీఎంసీని హెచ్చెల్సీకి మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. ఆ నీరు జిల్లా సరిహద్దుకు చేరుకోవడంతో కాలువలో ముళ్ల కంపలు అడ్డులేకుండా హెచ్చెల్సీ సిబ్బంది తొలగించారు. సాయంత్రానికి సరిహద్దులో 600 క్యూసెక్కులు వస్తున్నట్లు హెచ్చెల్సీ జేఈ అల్తాఫ్ తెలిపారు. గురువారం సాయంత్రానికి మైలాపురం గ్రామ సమీపంలోని 124 కి.మీ. వద్ద తుంగభద్ర జలాల ఉధృతి పెరిగింది.

విశాఖ ఉక్కుపై 14న ఆందోళనలు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వచ్చేనెల 14న ఆందోళనలు చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. 32 మంది బలిదానాలతో విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటైందని అన్నారు. రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తిని తగలబెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఉక్కు ఫ్యాక్టరీకి నామమాత్రంగా బడ్జెట్ కేటాయించడం చూస్తుంటే.. ప్రైవేటీకరణ ప్రయత్నాలు విరమించుకోవడం లేదన్నది స్పష్టమవుతోందని అన్నారు. దీనికి నిరసనగా వచ్చేనెల 14న వామపక్షాలు ఆందోళనలు చేపట్టనున్నాయని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయకార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున పాల్గొన్నారు.

నేడు రాయదుర్గంలో డీఐఈపీసీ సమావేశం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని శుక్రవారం రాయదుర్గం పట్టణంలోని టెక్స్‌టైల్ పార్కులో నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్ తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతినెలా నాలుగో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం ఉంటుందని, కానీ ఈనెల రాయదుర్గంలో నిర్వహించాలని కలెక్టర్ నిర్ణయించారన్నారు.

9 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కదిరి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 9 నుంచి 23 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. ఏర్పాట్లపై మార్చి ఒకటో తేదీన ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో దేవస్థానంలో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గుత్తి మండలం గొల్లలదొడ్డి (సేవాఘడ్)లోని గిరిజన గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఎస్టీ బ్యాక్‌లాగ్ 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి రామాంజనేయులు గురువారం ప్రకటనలో కోరారు. వెబ్‌సైట్ ద్వారా మార్చి 25వ తేదీలోపు దరఖాస్తు సమర్పించాలన్నారు. ఏప్రిల్ 6న విద్యార్థులకు గొల్లలదొడ్డిలోని పాఠశాలలో రాతపరీక్ష ఉంటుందన్నారు. ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు గొల్లలదొడ్డి పాఠశాల ప్రిన్సిపాల్ 9885369079, 8978239363, 9550655840 నంబర్లలో సంప్రదించాలని ఆయన వివరించారు.

నేడు ఉమర్ అలీషా జయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పిఠాపురం విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం గురుపరంపర 6వ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా 140వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం లలితకళాపరిషత్‌లో రాష్ట్రస్థాయి వేడుకలు నిర్వహిస్తున్నామని ఉమర్ అలీషా సాహితీ సమితి జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజుద్దీన్ గురువారం తెలిపారు. వేడుకలకు పీఠం 9వ పీఠాధిపతి ఉమర్ అలీషా విశిష్ట అతిథిగా హాజరవుతారని, 'భారతదేశం-మతసామరస్యం' అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు.

టమోటా కిలో రూ. 10

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

ఏపీ సీడ్స్ ఆస్తుల తాకట్టు..!

- దివాలా దిశగా విత్తనాభివృద్ధి సంస్థ
- వైసీపీ హయాంలో సబ్సిడీ సొమ్ము ఎగనామం
- ఇప్పటి దాకా రూ.564 కోట్లకు పైగా బకాయిలు
- ఖరీఫ్‌లో విత్తన సరఫరాపై నీలినీడలు

ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేసే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీ సీడ్స్) ఆస్తులను వైసీపీ పాలకులు తాకట్టు పెట్టారు. సంస్థకు చెల్లించాల్సిన సబ్సిడీ సొమ్ము జమ చేయకపోగా.. అనంతపురంలోని ఐదెకరాలతో పాటు రాష్ట్రంలోని వేర్వేరు చోట్ల ఉన్న ఆస్తులను విజయవాడలోని పలు బ్యాంకుల్లో తాకట్టు పెట్టినట్లు సమాచారం. గత పాలకులు చేసిన నిర్వాకంతో ప్రతి నెలా ఏపీసీడ్స్ బ్యాంకులకు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. వచ్చే ఖరీఫ్‌లో విత్తన సరఫరాపై దీని ప్రభావం పడుతోంది.



అనంతపురంలోని ఏపీ సీడ్స్ కార్యాలయం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రతి ఏడాది సబ్సిడీ విత్తనాలు సరఫరా చేసే ఏపీసీడ్స్ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ) దివాలా బాటలో పయనిస్తోంది. దాని ఆస్తులను ఇప్పటికే గత పాలకులు తనఖా పెట్టేశారు. ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లల్లో ఉమ్మడి అనంత జిల్లా రైతులకు ఏపీ సీడ్స్ సంస్థ ద్వారా విత్తన వేరుశనగ, అంతర పంటల విత్తనాలు, పప్పుశనగ విత్తనాలను సబ్సిడీతో సరఫరా చేస్తున్నారు. విత్తన పంపిణీ తర్వాత ఆ సంస్థకు సబ్సిడీ సొమ్మును ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా ప్రతి ఏడాది ఈ ప్రక్రియ సజావుగానే సాగుతూ వచ్చింది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అందుకు విరుద్ధంగా వ్యవహారం నడిచింది. గత పాలకులు చేసిన పాపం.. ఏపీసీడ్స్ సంస్థ పాలిట శాపంగా మారింది. గత ప్రభుత్వ ఆ సంస్థకు రావాల్సిన సబ్సిడీ డబ్బులను చెల్లించకపోవడంతో నేడు దివాలాతీసే పరిస్థితికి చేరుకుంది. బకాయి డబ్బులు చెల్లిస్తే తప్పా వచ్చే ఖరీఫ్‌లో వేరుశనగ, ఇతర విత్తనాలు సరఫరా చేసే పరిస్థితి లేదని సమాచారం.

వైసీపీ హయాంలో సబ్సిడీ సొమ్ము ఎగనామం

వైసీపీ పాలనలో ఉమ్మడి అనంత జిల్లాలోని రైతులకు ప్రతి ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ, అంతర పంటల విత్తనాలు, ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సబ్సిడీతో ఏపీసీడ్స్ పంపిణీ చేసింది. గత ఐదేళ్లల్లో రూ.470 కోట్లకుపైగా సబ్సిడీ సొమ్ము ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నట్లు సమాచారం.

బ్యాంకులో ఆస్తుల తనాఖా

మొత్తం కలిపి అనంత ఏపీసీడ్స్‌కు ఇప్పటి దాకా రూ.564 కోట్లకుపైగా సబ్సిడీ సొమ్ము పెండింగ్‌లో ఉంది. వైసీపీ హయాంలో రూ.470 కోట్లకు పైగా బకాయిలు ఉండగా.. 2024-25 సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి మరో రూ.94.30 కోట్లతో కలిసి రూ.564 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయి. గత వైసీపీ సర్కార్‌లో రాష్ట్ర వ్యాప్తంగా రూ.1312 కోట్లకుపైగా సబ్సిడీ సొమ్ము ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నట్లు సమాచారం. ఏపీసీడ్స్‌కు సబ్సిడీ సొమ్మును వైసీపీ పాలకులు చెల్లించకపోవడంతోపాటు.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ఆ సంస్థ ఆస్తులను విజయవాడలోని పలు బ్యాంకుల్లో తనాఖా పెట్టినట్లు సమాచారం. అనంతపురం జిల్లా కేంద్రం సమీపంలోని చిన్మయనగర్ వద్ద ఐదు ఎకరాల్లో ఏపీసీడ్స్ కార్యాలయంతోపాటు గోదాములు ఉన్నాయి. ఇతర జిల్లాల ఆస్తులతోపాటు అనంతలోని ఐదెకరాల ఆ సంస్థ ఆస్తిని గత ప్రభుత్వ హయాంలో బ్యాంకులో తనఖా పెట్టారు. గత వైసీపీ సర్కార్ చేసిన నిర్వాకంతో ప్రతి నెలా ఏపీసీడ్స్ బ్యాంకులకు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. ఏపీసీడ్స్‌కు చెల్లించాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం తక్షణమే చెల్లించేలా ప్రత్యేక చొరవ చూపాలని ఆ సంస్థ ఉద్యోగులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

బకాయిలు పెట్టడం దారుణం



కరువు జిల్లా రైతులకు ప్రతి ఏటా సబ్సిడీతో విత్తన వేరుశనగ, అంతర పంటలు, ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు, పప్పుశనగ ఏపీసీడ్స్ పంపిణీ చేస్తోంది. అలాంటి సంస్థకు వైసీపీ సర్కార్ కోట్లాది రూపాయలు సబ్సిడీ సొమ్మును చెల్లించకుండా బకాయిలు పెట్టడంతోపాటు బ్యాంకులో ఆస్తులు తనా ఖా పెట్టడం దారుణం. ఏపీసీడ్స్ సంస్థను నిర్వీర్యం చేయడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వం తక్షణమే బకాయిలు చెల్లించి రైతులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

-చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

ప్రభుత్వమే వడ్డీ చెల్లించాలి



రైతులకు సబ్సిడీతో విత్తనాలు అందించే ఏపీసీడ్స్ సంస్థకు వైసీపీ సర్కార్ బకా యిలు పెట్టడం అన్యాయం. గత ప్రభుత్వ నిర్ణయాలతో సంస్థ దివాలా స్థాయికి చేరింది. వైసీపీ హయాంలో కోట్లాది రూపాయలు సబ్సిడీ సొమ్ము బకాయిలు ఉండడం, సంస్థ నిర్వహణ భారం కావడంతో ఆస్తులను బ్యాంకుల్లో తనాఖా పెట్టారు. గత పాలకుల నిర్వాకం తో బ్యాంకులకు ప్రతినెలా ఏపీసీడ్స్ సంస్థ వడ్డీ చెల్లిస్తోంది. ఆ వడ్డీని ప్రభుత్వమే చెల్లించాలి. పెండింగ్ బకాయిలను తక్షణమే సంస్థకు జమ చేయాలి.

-మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురి మృతి

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో బుధవారం రాత్రి, గురువారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. శివరాత్రి ఉత్సవాలకు వెళుతూ ఇద్దరు యువకులు, వెళ్లి వస్తూ మరో యువకుడు మృతి చెందారు. పండుగ పూట ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



రామ్‌చరణ్ (ఫైల్)



తిరుమలేష్ (ఫైల్)

పావగడ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాల కోసం బుల్లితెర నటులు వస్తున్నారని తెలిసి రొద్దం మండలం రెడ్డిపల్లికి చెందిన ఆరుగురు యువకులు రెండు ద్విచక్రవాహనాలలో వెళ్తుండగా.. ఓ ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రామ్‌చరణ్ (18), తిరుమలేష్ (20) అనే యువకులు మృతిచెందగా భరత్ అనే యువకుడు తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతున్నాడు. రెడ్డిపల్లికి చెందిన రామ్‌చరణ్ మడకశిరలోని రామక్రిష్ణ పాలిటెక్నిక్ కళాశాలలో ఐటీఐ రెండో సంవత్సరం చదువుతున్నాడు. తిరుమలేష్ పెనుకొండలోని కియా పరిశ్రమలో పనిచేస్తుండేవాడు. భరత్ అనే యువకుడు హిందూపురం సేవామందిరంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రామ్‌చరణ్, తిరుమలేష్, భరత్ అనే యువకులు ఓ వాహనంలో అజయ్, ప్రశాంత్, నవీన్ మరో ద్విచక్రవాహనంలో పావగడ తాలూకా దొమ్మితిమర్రి మీదుగా లేపాక్షి ఉత్సవాల కోసం వెళ్తున్నారు. రామ్‌చరణ్ నడుపుతున్న ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో రామ్‌చరణ్ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రంగా గాయపడిన తిరుమలేష్, భరత్‌ను పావగడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హిందూపురం తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ తిరుమలేష్ మృతిచెందాడు. భరత్ చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

మంత్రి సవిత సంతాపం

పెనుకొండ రూరల్: కర్ణాటకలోని దొమ్మితిమర్రి సమీపంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రొద్దం మండలం రెడ్డిపల్లికి చెందిన రామ్‌చరణ్, తిరుమలేష్‌అనే యువకులు మృతి చెందడంపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఫోన్‌చేసి సంతాపం తెలిపారు. తీవ్రంగా గాయపడిన భరత్‌కు మెరుగైన వైద్యం అందించాలని హిందూపురంలోని ఏఆర్ ఆసుపత్రి వైద్యులకు సూచించినట్లు పేర్కొన్నారు.

బస్సు ఢీకొని యువకుడు..



విజయ్ (ఫైల్)

తనకల్లు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చీకటిమానుపల్లి వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో కుటాగుళ్ల గ్రామానికి చెందిన విజయ్(25) అక్కడికక్కడే మృతి చెందగా, చైతన్య అనే మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కుటాగుళ్లకు చెందిన విజయ్, చైతన్య బెంగళూరులోని గ్యాస్ గోడౌన్‌లో పనిచేస్తున్నారు. శివరాత్రి సందర్భంగా అన్నమయ్య జిల్లా కంబలపల్లి వద్దనున్న మల్లయ్యకొండకు దైవదర్శనానికి వెళ్లారు. ద్విచక్రవాహనంలో స్వగ్రామమైన కుటాగుళ్లకు వస్తుండగా తనకల్లు మండలం చీకటిమానుపల్లి వద్ద బళ్లారి నుంచి తిరుపతికి వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో విజయ్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రగాయాలపాలైన చైతన్యను మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగసుబ్బయ్య తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని మరొకరు..

పెద్దవడుగూరు : మండలంలోని తెలికి గ్రామ సమీపంలో ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో గుంతకల్లు మండలం పూలగుట్టపల్లితండాకు చెందిన స్వామినాయక్ (38) అనేవ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్వామినాయక్ స్వగ్రామం నుంచి యాడికి మండలం పుప్పాలతండా వెళ్లే క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వేగంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య మంగమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కోసం వెళ్లి మహిళా కూలీ..



అనురాధ (ఫైల్)

ఓబుళదేవరచెరువు: పొట్టకూటి కోసం ఉపాధికి వెళ్లిన మహిళా కూలీ అనురాధ(45) ఊపిరాగింది. భర్త కళ్లెదుటే రాతికప్పులు మీదపడి మృతిచెందిన సంఘటన గురువారం మండలంలోని ఇనగలూరువద్ద చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. చౌడంపల్లికి చెందిన బండి వెంకటేశ్ అతడి భార్య అనురాధ పొట్టకూటి కోసం ఏడాది క్రితం ఓబుళదేవరచెరువుకు వలస వచ్చారు. ఇనగలూరు బస్టాప్ వద్ద కోళ్లఫారం నిర్వహిస్తున్న నరసింహులుకు కల్వర్టు పని కోసం వెళ్లారు. మధ్యాహ్నం వరకు పనులుచేసి భోజనం కోసం వెళ్లారు. వాటర్‌బాటిల్ మరిచిన అనురాధ తీసుకురావడానికి కల్వర్టు వద్దకు వెళ్లింది. అదే సమయంలో ఉన్నపళంగా కల్వర్టుపైన కప్పిన రాతికప్పు ఆమె మీదపడి అక్కడికక్కడే మృతిచెందింది. అదిచూసిన భర్త గట్టిగా కేకలు వేయడంతో కోళ్లఫారం యజమానితోపాటు చుట్టుపక్కలవారు చేరుకున్నారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డికి సమాచారం అందించారు. ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ ద్వారా ఆమెపై పడిన కప్పును తొలగించారు. అప్పటికే ఆమె ప్రాణం పోయినట్లు గుర్తించారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మృతదేహంతో రాస్తారోకో..

మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవడంతోపాటు అందుకు కారకులైన కోళ్లఫాం యజమానిపై చర్యలు తీసుకోవాలంటూ మృతురాలి బంధువులు, వడ్డెర సంఘం నాయకులు శవంతో రాస్తారోకో నిర్వహించారు. గంటన్నరపాటు కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై రాకపోకలు స్తంభించాయి. ఈ సందర్భంగా వడ్డెర సంఘం నాయకులు వల్లెపు సోమశేఖర్, జరిపిటి అంజినప్ప, పీట్ల సుధాకర్, ఎంపీటీసీ శ్రీనివాసులు, శంకర, తదితరులు మాట్లాడుతూ.. మృతికి కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకుని, ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. ఎస్ఐ జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. బాధిత కుటుంబానికి పరిహారం చెల్లిస్తామని కోళ్లఫాం యజమాని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనురాధ మృతిపట్ల ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మతిస్థిమితంలేని యువకుడు..

హిందూపురం : గోరంట్ల మండలంలోని జాతీయ రహదారిపై వడిగేపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని 30 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని యువకుడు బుధవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పాలసముద్రం కూడలిలో వారం రోజులుగా మతిస్థిమితం లేని వ్యక్తి యాచించుకుని తిరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. బెంగళూరు రహదారిపై కొడిగేపల్లి క్రాస్ వద్ద అనంతపురం వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గోరంట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాహనం ఢీకొని ప్రైవేట్ టీచర్..

అనంతపురం క్రైం: రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్ టీచర్ మృతి చెందారు. రైల్వే శాఖలో పనిచేస్తున్న తారా మనోహర్(61) వీఆర్ఎస్ ఇచ్చి ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి తపోవనం నుంచి రామ్‌నగర్‌కు బైక్‌లో వెళ్తుండగా ఎస్‌మాక్స్ థియేటర్ సమీపంలో టాటా ఏసీ ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన తారా మనోహర్ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామును మృతి చెందారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొలుసు దొంగల బరితెగింపు

బైక్‌పై నుంచి పడి దంపతులు, చిన్నారికి గాయాలు

కనగానపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లపల్లి సమీపంలో ముసుగు ధరించిన దుండగులు గురువారం గొలుసు అపహరణకు యత్నించారు. ధర్మవరం నుంచి ద్విచక్రవాహనంలో నారాయణస్వామి, ఆమని దంపతులు చిన్నారితో కలిసి మామిళ్లపల్లి వైపునకు వస్తున్నారు. ఈక్రమంలో మామిళ్లపల్లి సమీపంలో ముసుగు ధరించిన ఇద్దరు దుండగులు ఎదురుగా వచ్చి ద్విచక్రవాహనంలో ఉన్న మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కునేందుకు ప్రయత్నించారు. గొలుసు తెగకపోవడంతో వాహనదారులు కిందపడ్డారు. అటువైపుగా వస్తున్న వాహనదారులను చూసిన దుండగులు పారిపోయారు. ద్విచక్రవాహనం నుంచి కిందపడిన నారాయణస్వామి, ఆమని, చిన్నారి గాయపడ్డారు. వారిని ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. కనగానపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.





వరిలో జింక్, పొటాషియం లోపం

- పంటను పరిశీలించి.. సూచనలు ఇచ్చిన శాస్త్రవేత్తలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంబులపూలకుంట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జింక్, పొటాషియం లోపం వల్లే వరి పంట తెగుళ్ల బారిన పడిందని కదిరి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రామసుబ్బయ్య, శాస్త్రవేత్త డాక్టర్ రమేష్‌నాయక్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో 'వదలని పీడ..!' శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించిన శాస్త్రవేత్తలు గురువారం వంకమద్ది ఆయకట్టు చెరువు కింద సాగుచేసిన వరిపంటను పరిశీలించారు. వరిపంటకు జింక్, పొటాషియం లోపం ఉందని, దీనిని నివారించకపోతే పంట ఎదుగుదల ఉండదని అన్నారు. పొటాషియం లోపం నివారణకు ఐదు గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. జింక్‌లోపం నివారణకు జింక్ సల్ఫేడ్ 2గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. పిలకదశలో ఉన్న సమయంలో ఎకరాకు 50 కిలోల యూరియా వాడాలన్నారు. వెన్నుదశలో 50 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ వినియోగించాలన్నారు. కాండం తొలుచు పురుగు, ఆకుముడత నివారణకు కోరాజిన్ 0.3ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వ్యవసాయాధికారి లోకేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

న్యూస్ బాక్స్

3 వరకు ఈ-క్రాప్ నమోదు : ఏఓ

శింగనమల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు మార్చి 3లోగా ఈ-క్రాప్ నమోదు చేయంచుకోవాలని ఏఓ అన్వేష్ కుమార్ తెలిపారు. ఈ-క్రాప్ నమోదుకు గురువారంతో గడువు ముగిసిందని, అధికారులు మార్చి 3 వరకు గడువు పెంచారని ఏఓ తెలిపారు. అలాగే ఈకేవైసీ వేయాలన్నారు.

గ్రామాల్లో శివపార్వతుల ఊరేగింపు

శింగనమల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శివరాత్రి వేడుకల సందర్భంగా మండలంలో శింగనమల, చిన్న జలాలపురం గ్రామాల్లో గురువారం శివప్వాతుల విగ్రహాల ఉరేగింపును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శింగనమలలోని చిన్నకాలువ వీధి కాలనీలోను శివపార్వతుల విగ్రహాలను ఊరేగించారు.

బిహార్ యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం సోములదొడ్డి సమీపంలో బీహార్ యువకుడు ఉరి వేసుకుని మృతి చెందాడు. బీహార్ రాష్ట్రం ముజఫర్‌పూర్ జిల్లా చక్కీకి చెందిన ఫులుకుమార్ (22) ఆర్నెల్ల క్రితం ఇక్కడకు వచ్చి సోముల దొడ్డి సమీపంలోని ఆవుల ఫామ్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి మద్యం తాడుడు. ఫోన్‌లో మాట్లాడి వస్తానని తన సోదరుడితో చెప్పి బయటకు వెళ్లాడు. గురువారం ఉదయం చూసిన సోదరుడికి షెడ్డులో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతున్న తమ్ముడు కనిపించాడు. కాగా వారికి గ్రామంలో ఓ అమ్మాయితో నడుపుతున్న ప్రేమ వ్యవహారమే అతడి ఆత్మహత్యకు కారణంగా తెలుస్తోంది. అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలికను గంటలో వన్‌టౌన్ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. గురువారం మధ్యాహ్నం సమయంలో తమ కుమార్తె స్కూల్‌లో కనిపించడం లేదని బాలిక తల్లిదండ్రులు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ స్పందించి ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బందిని బృందాలుగా విభజించి వెతకడానికి పంపారు. గంట సేపటికే తొమ్మిదేళ్ల బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నగర శివారులో ఓ యువకుడు మద్యం మత్తులో గురువారం హల్ చల్ చేశాడు. జాతీయ రహదారి సమీపంలోని తపోవనం సర్కిల్‌లో శివ అనే యువకుడు ప్రచార హోర్డింగ్ పైకి ఎక్కి కేకలు వేశాడు. కుటుంబ కలహాల కారణంగా తనకు ఎకరం భూమి ఇవ్వాలంటూ ఫోన్‌లో తన కుటుబసభ్యులను కోరాడు. భూమి ఇవ్వకపోతే కిందకు దూకేస్తానంటూ బెదిరించాడు. గమనించిన స్థానికులు, వాహనదారులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అతడిని కిందకు దింపి సర్ది చెప్పి పంపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీపురం గ్రామశివారులో గల 67వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బుక్కరాయసముద్రం మండలం కేకే అగ్రహారం గ్రామానికి చెందిన నరసయ్య, సత్యవతి కుటుంబాల సభ్యులు ఆటోలో గుంతకల్లు మండలం కసాపురం ఆలయానికి వెళ్లి తిరిగి వ స్తున్నారు. శ్రీపురం గ్రామశివారులోకి రాగానే ఆటో ప్రమాదవశాత్తూ బోల్తాపడింది. ప్రమాదం లో డ్రైవరు నరసయ్యతో పాటు సత్యవతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నాటుసారాకు దూరంగా ఉండాలి

● ఎక్సైజ్ సీఐ

నార్పల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజలు నాటుసారా జోలికి వెళ్లకుండా దూరంగా ఉండాలని బుక్కరాయసముద్రం ఎక్సైజ్ సీఐ నాగసునీత రాణి సూచించారు. మండలంలోని గూగూడు గ్రామంలో గురువారం నవోదయ 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు నాటుసారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. గ్రామాల్లో ఎవరైనా నాటుసారా విక్రయించిన, తయారు చేసిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వీఆర్వో, మహిళా పోలీస్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

యువరైతుకు పాముకాటు

కనగానపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్లపల్లి మిద్దెల గ్రామానికి చెందిన యువరైతు పాముకాటుకు గురయ్యాడు. గ్రామానికి చెందిన రైతు గోవిందరెడ్డి కుమారుడు తేజేశ్వరరెడ్డి గురువారం తెల్లవారుజామున పేడ తీసేందుకు పశువుల పాకలోకి వెళ్లాడు. పశువుల పేడను తీస్తుండగా అతడి కాలికి పాము కాటు వేసింది. కుటుంబసభ్యులు అతడిఇన ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స లందించి, మెరుగైన వైద్యం కోసం అనంతరం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యపరిస్థితి మెరుగ్గా ఉన్నట్టు గ్రామస్థులు తెలిపారు.

ఎలక్ట్రిక్ స్కూటర్ నుంచి మంటలు



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాంనగర్‌లోని ద్వారకామయి అపార్ట్‌మెంట్‌లో ఓ ఎలక్ట్రిక్ స్కూటర్ నుంచి గురువారం మధ్యాహ్నం మంటలు వెలువడ్డాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడకు వచ్చి మంటలను ఆదుపు చేశారు. అప్పటికే స్కూటర్ మొత్తం కాలిపోయింది. ఎలక్ట్రిక్ స్కూటర్‌లో షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు చెలరేగి ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు.

కన్నులపండువగా రథోత్సవం



స్వామి రథోత్సవంలో పాల్గొన్న ఆలయ కార్యవర్గం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలో మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదోరోజు గురువారం బ్రహ్మరథోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని కల్యాణమండపంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయంలో ఉదయం రథాంగ హోమం, రథాంగబలి నిర్వహించారు. అనంతరం మడుగుతేరు లాగారు. గర్భగుడిలోని కాశీ విశ్వేశ్వర లింగానికి రుద్రాభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజా కార్య క్రమాలు నిర్వహించారు. సాయంత్రం వి శేషంగా అలంకరించిన రథంలో శివపార్వ తుల ఉత్సవ మూర్తులను ఉంచి పురవీధు ల్లో రథాన్ని లాగారు. రథోత్సవం ఎదుట భక్తులు భజనలు చేస్తూ ముందుకు సా గారు. ఆలయ ఆవరణలోని వేదికపై చిన్నారులు సంప్రదాయ నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, నరేంద్రచౌదరి, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.



చిన్నారి నృత్య ప్రదర్శన

తాగునీటి సమస్య పరిష్కరించాలి

● వంద గజాల విద్యుత్ వైరు ఇచ్చేందుకు వందరోజులా..?
● శివపురం ఎస్సీ కాలనీ వాసుల ఆందోళన



కొత్త బోరు వద్ద ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

శింగనమల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రాయపేట పంచాయతీ శివపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజా ప్రతి నిధులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్న స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు గురువారం గ్రామంలోని కొత్త బోరుబావి వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మండలంలో నాలుగేళ్లుగా సిక్స్‌వే రోడ్డు పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో దాదాపు నాలుగైదు నెలల కిందట గ్రామం వద్ద ఉన్న ఎస్సీ కాలనీకి తాగునీరు సరఫరా చేసే పైపులు రోడ్డు పనుల్లో ధ్వంసం అయ్యాయని, దీంతో కాలనీకి నీరు రావడంలేదన్నారు. దీంతో కొత్తగా బోరు బావి తవ్వించి, మోటార్ బిగించి కాలనీకి పైపు లైన్ వేయాలని పలు మార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించామని తెలిపారు. ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. ఆర్టీటీ వారు స్పందించి, కాలనికి తాగునీటి సమస్య పరిష్కారం కోసం దాదాపు మూడు నెలల కిందట కొత్తగా బోరు తవ్వించి, మోటారు బిగించారని తెలిపారు. అయితే మోటారుకు కరెంటు కనెక్షన్ ఇవ్వాలని కోరుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యుత్ అధికారులు, సిక్స్‌వే రోడ్డు కాంట్రాక్టర్ ఒకరిమీద ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మోటారుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు కేవలం వంద గజాల వైరు అవసరమని, అది ఇచ్చేందుకు వంద రోజుల నుంచి వేడు కుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మోటర్‌కు విద్యుత్ కనిక్షన్ ఇచ్చి, తమకు నీరు సరఫరా చేయాలని మహిళలు కోరారు.

పల్లె సంప్రదాయాలను కాపాడుకోవాలి

● ఎమ్మెల్యే పరిటాల సునీత
● ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల సంప్రదాయలు ఇటీవల కాలంలో కనుమరుగవుతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండల పరిధిలోని బి. యాలేరు గ్రామంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకోని గురువారం పరిటాల రవీంద్ర ట్రస్టు ఆధ్వర్యంలో రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరయ్యారు. పోటీలును తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చారు. ఉత్సాహంగా జరిగిన పోటీల్లో 10జతల ఎద్దులు పాల్గొన్నాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు పరిటాల రవీంద్ర ట్రస్టు ద్వారా నగదు బహుమతులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి పరశురామ్, మండల మాజీ కన్వీనర్ క్రిష్ణమోహన్ చౌదరి, మండల నాయకులు నాగేంద్ర, ఈశ్వరయ్య, ఈడిగ ఈశ్వరయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం: మొదటి బహుమతి సాధించిన తోపుదుర్తి చెన్నప్ప ఎద్దులకు రూ. 50వేలు నగదు అందజేశారు. రెండో బహుమతి రూ. 40వేలను గార్లదిన్నె రామాంజనేయులుకు, మూడో బహుమతి రూ.30 వేలను కట్టకింద పల్లి అచారికి, నాలుడో బహుమతి రూ.20వేలను సోములదొడ్డి రామసుబ్బారెడ్డికి, ఐదో బహుమతి రూ.10 వేలను ధర్మవరం రవీంద్రారెడ్డికి అందజేశారు. పోటీలకు వచ్చిన ఎద్దుల యజమానులను ట్రస్టు ద్వారా మొమెంటోలతో సత్కరించారు.



రాతి దూలం లాగుతున్న ఒంగోలు గిత్తలు

గుజిరీలో అగ్నిప్రమాదం



గుజిరీలో చెలరేగుతున్న మంటలు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థాని క కళ్యాణ దుర్గం రోడ్డులో అర్ధరాత్రి 1 గంట సమ యంలో గుజిరిలో నుంచి మంటలు చెలరేగాయి. పెద్ద ఎత్తున మంటలు ఎగసి పడటంతో స్థానికులు భయాందోళకు గురయ్యారు. రోజూ మాదిరి గానే నిర్వాహకుడు శ్రీరాములు బుధవారం సాయంత్రం గుజరీని మూసివేసి ఇంటికెళ్లాడు. ఆ గుజరీ నుంచి అర్ధ రాత్రి మంటలు రావడం స్థానికులు గమనించి, అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపకశాఖాధికారి లింగమయ్య సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. గుజిరీ ఉన్న ప్రాంతంలో పైన హైటెన్షన్ వైర్లు ఉండటంతో షార్ట్ సర్క్యూట్‌తోనే అగ్నిప్రమాదం చోటు చేసుకుందని కేసునమోదు చేసినట్లు ఏడీఎఫ్ఓ లింగమయ్య తెలిపారు. రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని తెలిపారు.

దుకాణంలో...

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బళ్లారి బైపాస్ రోడ్డు ఎంజీ పెట్రోల్ బంకు నుంచి తపోవనం వెళ్లే సర్వీస్ రోడ్డులో ఉన్న ప్రధాన రోడ్డులోని దుకాణంలో గురువారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే స్పందించి మంటలను అదుపు చేశారు. అయితే దుకాణంలో ఉన్న కొన్ని టైర్లు మాత్రం అగ్నికి ఆహుతైనట్లు ఏడీఎఫ్ఓ లింగమయ్య తెలిపారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరే లోపే స్థానికులు మంటలు ఆర్పివేసినట్లు తెలిపారు.

నేడు శాస్త్రీయ అవగాహనపై సదస్సు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జేవీవీ ఆధ్వర్యంలో శుక్రవారం నగర శివారులోని సమతాగ్రాంలో ఉన్న రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్‌లో 'పిల్లల్లో శాస్త్రీయ అవగాహన' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు జేవీవీ నగరాధ్యక్షుడు రామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.

'రీ వెరిఫికేషన్ పారదర్శకంగా నిర్వహించాలి'

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సంబంధించిన పింఛన్ల రీ వెరిఫికేషన్ పారదర్శకంగా నిర్వహించాలని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. రూ.15వేలు, రూ.10వేలు, రూ.6వేలు పింఛన్ పొందుతున్న దివ్యాంగులకు అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో డాక్టర్లు పారదర్శకంగా రీ వెరిఫికేషన్ చేయాలన్నారు. మాట, వినికిడి లోపం కలిగిన నిజమైన దివ్యాంగులతో కొందరు దళారులు రూ.10వేల నుంచి రూ.20వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దళారులను నమ్మి ఎవరూ మోసపోకూడదని సూచించారు. తమ సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగుల నుంచి డబ్బులు వసూలు చేసే వారి వివరాలను సేకరించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. అలాంటి వారిపై అనంతపురం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్, డీఆర్‌డీఏ పీడీలకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

వైజ్ఞానిక ప్రదర్శనతో సృజనాత్మకత: ఏజీఎం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్కూళ్లలో వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని ఏజీఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. హౌసింగ్‌బోర్డులోని శ్రీచైతన్య బాలికల స్కూల్‌లో గురువారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఏజీఎం ముఖ్యఅతిథి గా హాజరై, జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు సుమారు 200 వరకూ తయారు చేసి ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ నమూనాలు రూపొందించిన విద్యార్థులకు మొదటి, రెండవ, మూడవ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాఖాన్, జోనల్ కో-ఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్ సత్యనారాయణ, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

డ్రగ్స్ గోదామును తనిఖీ చేసిన కలెక్టర్



మందుల నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రులకు మందులు సరఫరా చేస్తున్న డ్రగ్స్ గోదామును కలెక్టర్ వినోద్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. జిల్లాకేంద్రంలోని శారదా నగర్‌లో ఉన్న గోదాము కు వెళ్లి అక్కడ నిల్వ ఉన్న మందుల విరాలను ఆరాతీశారు. రికార్డుల ఆదారంగా పరిశీలించారు. అనంతరం అక్కడే వైద్యాధికారులు, డ్రగ్స్ గోదాము నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఆస్పత్రులకు వచ్చే రోగులకు డాక్టర్లు రాసిచ్చే ప్రతి మందు, మాత్ర అందించాల న్నారు. సక్రమంగా పనిచేయని ఫార్మసిస్టుపై చర్యలు తీసుకోవలన్నారు. ఏ ఆస్పత్రిలోనూ సమయానికి మందులు రాలేదనే మాట వినపడకూడదన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి, డీసీహెచ్ఎస్ డాక్టరు రవికుమార్, ఆస్పత్రి సూప రింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై కఠిన చర్యలు తీసుకోండి: కలెక్టర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని, అలాంటి బాల్యవివాహాలు చేసేవాళ్లపై చట్టబద్ధంగా కఠినచర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్.. అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాల నిర్మూలనపై గురువారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... సమష్టిగా పనిచేసి బాల్యవివాహాలను అరికట్టడంతో పాటు లింగ వివక్ష లేకుండా ఆడపిల్లను రక్షించుకుందామ పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీసీపీఓ మంజునాథ్, డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, వివిధ శాఖల అధికారులు, రెడ్స్ సంస్థ భానుజ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మార్పు కనబడాలి

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రమైన నగరంలో మార్పు కనిపించాలని, వివిధ రకాల అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. చెట్లపెంపకంపై నగర ప్రజలకు అవగాహనకల్పించాలని ఆదేశించారు. ఈ నెల 25నాటికి ప్లాంటేషన్ పక్రియను పూర్తిచేయాలని సూచించారు. మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాల న్నారు. నగరపాలక కమిషనర్ బాలరాజు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ, డీటీసీ వీర్రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమయాన్ని వృథా చేసుకోవద్దు

● వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ దయాకరరావు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కాలం చాలా విలువైనదని, వృథా చేసుకోవద్దని వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టరు దయాకరరావు మెడికోలకు సూచించారు. స్థానిక మెడికల్ కళాశాలలో గురువారం మెడికల్ విద్యార్థులకు నెల్లూరు మెడికల్ కళాశాలకు చెందిన వ్యక్తిత్వ నిపుణులు డాక్టరు గూడపాటి దయాకరరావుతో మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ వైద్యవృత్తి ఎంతో విలువైనది, గౌరవప్రదమైనదని అన్నారు. అలాంటి వృత్తిలో రాణించాలంటే ఎంతో క్రమశిక్షణ, పట్టుదల ఉండాలన్నారు. సమయం వృథా చేసుకోవడం కన్నా వృత్తి పరంగా మరిన్ని కొత్తవిషయాలు తెలుసుకోవడం అలరచుకోవాలని సూచించారు.

డంపింగ్ యార్డును తొలగించాలి: సీపీఎం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నగర శివారులో గుత్తిరోడ్డులోని డంపింగ్ యార్డును తొలగించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాజీవ్‌కాలనీ పంచాయతీ కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ... నగరంతోపాటు చుట్టూ ఉన్న మేజర్ గ్రామ పంచాయతీల నుంచి రోజూ పెద్దఎత్తున డంపింగ్ యార్డులో వేస్తున్నారని అన్నారు. దాని నుంచి వచ్చే తీవ్ర దుర్వాసనతో కూడిన పొగ, కలుషితమైన గాలితో నగరంతోపాటు రాజీవ్ కాలనీ, నారాయణపురం పంచాయతీల్లోని ప్రజలు ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా డంపింగ్ యార్డును తొలగించాలని కోరారు. సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ఆర్‌వి నాయుడుడు, ముత్తుజ, రాజీవ్ కాలనీ ఉపసర్పంచ్ మసూద్, మాజీ సర్పంచ్ హుస్సేన్, ఆవాజ్ వలి, నగర కమిటీ సభ్యులు ఎన్టీఆర్ శీన, వెంకట్, రాజు, వెంకటేష్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధ, గురువారాల్లో రెండు రోజులపాటు సాగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో ఐదో ఇంటర్నల్ షటిల్ బ్యాడ్మిం టన్ పోటీలు నిర్వహించారు. ఇందులో మూర్తి-విజయ్‌కుమార్ జోడీ విజేతగా నిలువగా, టీచర్ రామాంజనేయులు- ఫెర్టిలైజర్ రామాంజి జోడీ ద్వితీయ స్థానంలో, షాషావలి-షన్ముఖ జోడీ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు సాఫ్ట్ వేర్ ఉద్యోగి శాంతన్‌రెడ్డి సహకారంతో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, సుబ్బారావు, సభ్యులు రామకృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, దాసరి శ్రీనివాసులు, ధనుంజయ, వన్నూరప్ప పాల్గొన్నారు.

'వక్ఫ్' ఆదాయాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించాలి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చే విద్యాభివృద్ధికి, సేవాకార్యక్రమాలకు వినియోగించాలని ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బా షా డిమాండ్ చేశారు. నగరంలోని ప్రజాబలం కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా వక్ఫ్ బోర్డు ఆశయాలను నిర్వీర్యం చేస్తున్న బోర్డు మేనేజ్‌మెంట్ కమిటీలు, అధికారుల వల్ల లక్షలాది ఎకరాలు కబ్జాకు గురయ్యా యన్నారు. వక్ఫ్ ఆస్తులు చాలావరకు అన్యాక్రాంతమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

● షటిల్ టోర్నీని ప్రారంభించిన ఎస్ఐ

గార్లదిన్నె, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహపడుతాయని ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా పే ర్కొన్నారు. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని బుధవారం రాత్రి కల్లూరులో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు రాయలసీమ స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. దాదాపు 40 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను ఎస్ఐ మహమ్మద్ గౌస్‌బాషా ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో కల్లూరుకు చెందిన రాహుల్, సునిల్ జట్టు ప్రథమ స్థానం, కిషోర్, శ్రీకాంత్ జట్టు రెండో స్థానం, నంద్యాల సాయి, కౌశిక్ జట్టు మూడో స్థాని, పామిడి నరేష్, మసూద్ జట్టు నాలుగో స్థానంలో నిలిచారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10,016ను టీడీపీ నాయకులు సామాల బ్రదర్స్ సామాల మధు, సామాల రామాంజినేయులు రెండో బహుమతి రూ. ఏడు వేలను గణేష్, సాయితేజ, మూడో బహుమతి రూ.ఐదు వేలను కమతాల రహంతుల్లా, నాలుగో బహుమతి రూ.రెండు వేలను రైస్‌మిల్ వెంకట్రాముడు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న జట్లకు రియల్‌ఎస్టేట్ నరసింహులు మెడల్స్, ట్రోపీలను అందజేశారు. కార్యక్రమంలో కల్లూరులోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బెల్లం ఊట ధ్వంసం

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీటీ ఆర్ పల్లి తండాలో గురువారం దాడులు నిర్వహించి నాటు సారా తయారీకి ఉపయోగించే రెండు వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పట్టణ ఎక్సైజ్ సీఐ హసీనాబాను తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా దాడులు చేసినట్లు చెప్పారు. అలాగే తయారీదారుడు గోవిందనాయక్ నుంచి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని, అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐ అంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ పీతా నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ


ప్రయాణికులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్

ఉరవకొండ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో మాట్లాడి అక్కడి వసతులపై ఆరా తీశారు. తర్వాత మహిళల మరుగుదొడ్లను పరిశీలించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని డిపో అధికారులకు సూచించారు. డిపో ద్వారా ఎన్ని బస్సు సర్వీసులు నడుస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇన్‌చార్జి డిపో మేనేజరు హంపన్న, తహసీల్దారు మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామి సేవలో న్యాయాధికారి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):మండలంలోని కసాపురం గ్రామంలో గల లక్ష్మీనారాయణస్వామిని గుంతకల్లు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి మంజుల దర్శించుకున్నారు. అర్చకులు న్యాయాధికారి పేరిట అర్చనలు, ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు.

నవోదయం 2.0పై అవగాహన

కళ్యాణదుర్గంరూరల్/రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవోదయం 2.0 లో భాగంగా నాటు సారా రహిత జిల్లాగా చేయడానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం ఎక్సైజ్ స్టేషన్‌లోనూ, కంబదూరు మండలంలో నాటు సారా తయారు చేసే గ్రామాలలోనూ ఆయన నవోదయం 2.0 పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటుసారా వల్ల కలిగే అనర్థాలు ప్రజలకు వివరించారు. ఎవరైనా నాటుసారా అమ్మినా, తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, కళ్యాణదుర్గం, కంబదూరు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. రాయదుర్గం పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌నుఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి తగు సూచనలు అందించారు. తర్వాత రాయదుర్గం ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని పలు మద్యం షాపులను తనిఖీ చేశారు. ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్, ఎస్ఐ పవన్ పాల్గొన్నారు.

కూలిరేటు పెంచాలని వినతి

తాడిపత్రి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీడీ కార్మికులకు కూలిరేటు రూ.200 నుంచి రూ. 300 పెంచి ఇవ్వాలని కోరుతూ గురువారం స్థానిక డీసీఎల్ లేబర్ అధికారికి ఆ కూలీల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఓబులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా బీడీలు చుడుతున్న కార్మికులకు కూలిరేటు పెంచకపోవడంతో కుటుంబపోషణకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే కూలి రేటు పెంచాలన్నారు. అలాగే వారి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్‌చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర, డివిజన్ కన్వీనర్ ఉమాగౌడ్ తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు


రాతి దూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న సీఐ రాజు

కూడేరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చితంబర స్వామి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మరుట్ల 3వ కాలనీలో గురువారం రాతి దూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసుల సహకారంతో నిర్వహించిన ఈ పోటీలను సీఐ రాజు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ పోటీల్లో 14 జతలు ఎద్దులు పాల్గొన్నాయి. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా అంద్రాల్ గ్రామానికి చెందిన ఆనంద్ వృషభాలు మొదటి బహుమతిగా రూ, 40వేలు గెలుచుకున్నాయి. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం గుడికల్లుకు చెందిన నల్లయ్య వృషభాలు రెండో బహుమతిగా రూ,30 వేలు, శ్రీసత్యసాయిజిల్లా, కనగానిపల్లి మండలం మద్దల చెరువుకు చెందిన చిన్న కొండయ్య వృషభాలు మూడు బహుమతిగా రూ 20 వేలు, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం గుడికల్లుకు చెందిన తిరుపాల్ వృషభాలు నాలుగో బహుమతిగా రూ,10 వేలు దక్కించుకున్నాయి. వృషభాల యజమానులకు సీఐ రాజు, టీడీపీ నాయకులు బహుమతులు అందజేశారు. పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

తాడిపత్రి: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని తిమ్మేపల్లి గ్రామంలో నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో 9జతల ఎద్దులు పాల్గొన్నాయి. యాడికి మండలం పెద్దపేట గ్రామానికి చెందిన చెన్నారెడ్డి వృషభాలు మొదటి బహుమతిగా రూ.25వేలు గెలుచుకున్నాయి. వీరన్నపల్లికి చెందిన వెంకటరాముడు వృషభాలు రెండో బహుమతి కింద రూ.20వేలు, తాడిపత్రికి చెందిన నాగార్జున వృషభాలు తృతీయ బహుమతి కింద రూ.15వేలు, చంద్రాయునిపల్లికి చెందిన రామకృష్ణారెడ్డి వృషభాలు నాలుగో బహుమతి కింద రూ.7వేలు, తాడిపత్రికి చెందిన నాగేంద్ర వృషభాల 5వ బహుమతి కింద రూ.5వేలు గెలుచుకున్నాయి.

ప్రభుత్వాస్పత్రి తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని ఆర్డీఓ వసంత్‌బాబు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి వైద్యుల పనితీరు, వైద్య సదుపాయాలను రోగులనడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తర్వాత ఆస్పత్రి బిల్డింగ్, పరిసరాలు, మార్చురీని పరిశీలించారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు


శెట్టూరులో ప్రత్యేకాలంకరణలో చంద్రమౌళేశ్వరస్వామి

శెట్టూరు/బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):: శివరాత్రి పర్వదినం సందర్భంగా మం డలకేంద్రంతో పాటు అయ్యగార్లపల్లి, ములకలేడు, లింగదీర్లపల్లి, లక్ష్మంపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లోని శివాలయాల్లో గురువారం ఉద యం ప్రత్యేకపూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే శివలింగాలకు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. జాగారణ చేసిన భక్తులు స్వామిని దర్శించుకుని ఉపవాసం వదిలారు. పలు ఆలయాల వద్ద అన్నదానం జరిగింది. అలాగే బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని శివాలయంలోనూ విశేష పూజలు నిర్వహించారు.


అశేష భక్తజనం నడుమ కదులుతున్న బుగ్గ రామలింగేశ్వరుడి రథం


యాడికి మండలం కోనలో రామలింగేశ్వరుడి రథోత్సవం


ఉరవకొండ మండలం పెద్దముష్టూరులో సిద్దేశ్వర స్వామి రథోత్సవం

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

● వైభవంగా రథోత్సవాలు ● అశేషంగా పాల్గొన్న భక్తులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం పలు ప్రాంతాల్లో శివపార్వతుల కల్యాణోత్సవాలు, రథోత్సవాలు కన్నులపండువగా జరిగాయి. ఈ సందర్భంగా తొలుత ఆయా ఆలయాల్లో అర్చకులు ఉదయమే స్వామివార్ల మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణాల్లో స్వామి, అమ్మవార్ల ఉత్సవవిగ్రహాలను పట్టువస్త్రాలు, వివిధ పూలతో అలంకరించి వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని వైభవంగా జరిపారు. తర్వాత సాయంత్రం ఉత్సవమూర్తులను రథాలలో కొలువుదీర్చి రథోత్సవాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొని రథాలపైకి అరటిపండ్లు , పూలు విసిరి మొక్కులు తీర్చుకున్నారు.

●తాడిపత్రి పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పార్వతీసమేత స్వామివారికి కల్యాణాన్ని జరిపించారు. అలాగే రథోత్సవం నిర్వహించారు. గాంధీకట్ట వద్ద నుంచి ప్రారంభమైన మహారథోత్సవం మెయిన్‌బజారు, అభయాంజనేయస్వామి విగ్రహం వరకు సాగింది. అదేవిధంగా స్థానిక అంబాభవానీ ఆలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హాజరై తిలకించారు.

●యాడికి మండలంలోని కోన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శివపార్వతుల కల్యాణాన్ని, రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని భోగలింగేశ్వరస్వామి ఆలయం, భైరవలింగేశ్వరస్వామి ఆలయం, నాగ లింగేశ్వరస్వామి ఆలయంతో పాటు రాయలచెరువులోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, గౌరీ శంకర ఆలయాల్లో శివపార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

●ఉరవకొండ మండలంలోని పెద్దముష్టూరు గ్రామంలో సిద్దేశ్వర స్వామి రథోత్సవాన్ని, ఆమిద్యాల గ్రామంలో భీమలింగేశ్వరస్వామి రథోత్సవాన్ని, వజ్రకరూరు మండలం జరుట్ల రాంపురంలో జరుట్ల రామలింగేశ్వ స్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.


తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

●గుంతకల్లు పట్టణంలోని పాతగుంతకల్లులో బీరప్ప స్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టీడీపీ, జనసేన, సీపీఐ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బుగ్గసంగాల గ్రామంలో గల బుగ్గసంగమేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు.

● కుందుర్పి మండలం రుద్రంపల్లిలో గల పురాతన శివాలయంలో శివపార్వతుల కల్యాణం, అనంతరం ఈశ్వరస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

● బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడ గ్రామంలో ఎణ్లే రంగనాథస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.

● డీ.హీరేహాళ్ మండలం పులకుర్తి గ్రామంలో సద్గురు జంబణ్ణతాత రథోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు.

● రాయదుర్గం పట్టణంలోని బళ్లారిరోడ్డులో ఉన్న నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారి బ్రహ్మరథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయ కల్యాణమండపంలో గిరిజా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.


గుంతకల్లు మండలంలో బుగ్గ సంగమేశ్వర స్వామి రథోత్సవం


రాయదుర్గంలో నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం


బొమ్మనహాళ్ మండలం గోవిందవాడలో ఎణ్లే రంగనాథస్వామి రథోత్సవం


డి. హీరేహాళ్ మండలం పులకుర్తిలో జంబణ్ణతాత రథోత్సవం

మద్దానేశ్వరస్వామి సన్నిధిలో ప్రభుత్వ విప్ కాలవ


మద్దానేశ్వరస్వామి ఆలయంలో విప్ కాలవశ్రీనివాసులు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలోని మద్దానేశ్వరస్వామి ఆలయాన్ని, పట్టణంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయాన్ని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివార్లను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో జరిగిన గిరిజా కల్యాణోత్సవాన్ని తిలకించారు.

నేడు రథోత్సవం

మద్దానేశ్వరస్వామి 89వ రథోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. దీంతో ఉదయం రథోత్సవానికి కలశస్థాపన చేస్తామని, తర్వాత ఆలయంలో స్వామికి ప్రత్యేక అలంకరణలు, పూజలు, హోమాలు జరుపుతామని, సాయంత్రం 4 గంటలకు రథోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ వారు తెలిపారు. భక్తులు భారీగా వస్తారన్నారు.

రేషన్ ఇబ్బందులపై ఆర్డీఓ విచారణ

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందయ్య దొడ్డికి సంబంధించిన రేషన్ షాపును వేపులపర్తిలో నిర్వహిస్తున్నారు. దీంతో గోవిందయ్యదొడ్డి గ్రామస్థులు ప్రతినెలా మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ గ్రామానికి వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి వస్తోంది. దీంతో తమకు ఇబ్బందిగా వుందని, రేషన్‌షాపును తమ గ్రామంలోనే ఏర్పాటు చేయాలని ఇటీవల ఆ గ్రామస్థులు ఆర్డీఓ వసంతబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన గురువారం ఆర్ఐ నాగిరెడ్డితో కలిసి గోవిందయ్య దొడ్డి గ్రామానికి వెళ్లారు. రేషన్ కోసం గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. సమస్య పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు.

భూ రీసర్వేను పరిశీలించిన జాయింట్ కలెక్టర్



యాడికి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందన రెవెన్యూ పంచాయతీలో జరుగుతున్న భూరీసర్వేను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో మాట్లాడారు. భూముల రీసర్వేకు ఫలానారోజున వస్తున్నామని అధికారులు మీకు ముందస్తు సమాచారం ఇస్తున్నారా... లేదా అని ఆ రా తీశారు. సమాచారం ఇస్తున్నారని రైతులు సమాధానమిచ్చారు. భూ యజమానుల సమక్షంలోనే రీ సర్వే చేయాలని సర్వే అధికారులకు సూచించారు. అలాగే రీసర్వేను వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ (రీసర్వే) రాజ్ కుమార్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

పెద్దపప్పూరు: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ శివనారాయణశర్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డుల గదిని పరిశీలించారు. ప్రతి రికార్డును జాగ్రత్తగా ఉంచాలని అక్కడి సిబ్బందికి సూచించారు. తర్వాత చిన్నయక్కలూరులో జరుగుతున్న భూ రీసర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, జిల్లా సర్వే ఏడీ రూప్లనాయక్, తహసీల్దార్ బాలాజీరాజు, డిప్యూటీ తహశీల్దార్ శ్వేత, ఆర్ఐ ప్రసన్నకుమార్, వీఆర్వోలు పాల్గొనడం జరిగింది.

సైబర్ నేరాలపై అవగాహన

కుందుర్పి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు గురువారం ట్రైనీ డీఎస్పీ అర్షద్ అలీ సైబర్ సురక్ష కింద స్క్రీన్ ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా వుండాలంటూ సూచించారు. ఎవరైనా మోసపోతే 1930కు పిర్యాదు చేయాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది, పాఠశాల ఎస్ఓ నాగ రత్నబాయి పాల్గొన్నారు.



స్క్రీన్ ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీపురం గ్రామశివారులో గల 67వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బుక్కరాయసముద్రం మండలం కేకే అగ్రహారం గ్రామానికి చెందిన నరసయ్య, సత్యవతి కుటుంబాల సభ్యులు ఆటోలో గుంతకల్లు మండలం కసాపురం ఆలయానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. శ్రీపురం గ్రామశివారులోకి రాగానే ఆటో ప్రమాదవశాత్తూ బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవరు నరసయ్యతో పాటు సత్యవతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరిపై కేసు నమోదు

యాడికి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తనపై దాడిచేసి గాయపరిచారని నరేంద్ర అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అశోక్, వేణు అనే ఇద్దరు వ్యక్తులపై గురువారం కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ వెంకటరమణయ్య తెలిపారు. నిట్టూరు గ్రామానికి చెందిన నరేంద్ర ద్విచక్రవాహనంలో వెళుతున్న సమయంలో దారిలో అశోక్, వేణు అడ్డువచ్చారు. పక్కకు తప్పుకోవాలని చెప్పినందుకు నరేంద్రపై వారిద్దరూ దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉరవకొండ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలంలో బుధవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొనడంతో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వన్నూరు స్వామి (39) మృతి చెందాడు. గాయపడిన అతనిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

తాడిపత్రి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కడప, అనంతపురం, చుక్కలూరు, బుగ్గకు వెళ్లే రహదారుల్లో ఉన్న పెట్రోల్ బంకుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి గురువారం ప్రకటనలో నిర్వాహకులకు సూచించారు. ప్రతి పెట్రోల్ బంకులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని, రోడ్డు కనిపించేవిధంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. చోరీలు, ప్రమాదాలు జరిగితు వాటి ద్వారా తెలుసుకోవచ్చునని అన్నారు. మండలంలోని విల్లాస్‌లో ఉన్న ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

పట్టణంలో పలు ప్రాంతాల్లో పట్టణ సీఐ సాయిప్రసాద్ డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేశారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయా అని ఉద్దేశంతో డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలించారు.

సదరం శిబిరానికి 149 మంది హాజరు

రాయదుర్గం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వికలాంగుల ధృవీకరణ పత్రాల మంజూరు కోసం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన సదరం శిబిరానికి 149 మంది హాజరయ్యారు. గత మంగళవారం ప్రారంభమైన శిబిరంలలో రోజూ 50 మంది దాకా స్లాట్‌లు నమోదు చేసుకోగా వీరికి వైద్యపరీక్షలు నిర్వహించి గురువారం సాయంత్రంతో ముగించారు. దీంతో 150 మంది స్లాట్‌లు నమోదు చేసుకోగా 149 మంది హాజరైనట్లు వైద్యుడు హరి కుమార్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగిరి క్రాస్ గ్రామంలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన చిన్న సుంకన్న గత నాలుగురోజుల క్రితం గ్రామంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. చిన్నసుంకన్నకు అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో భూతగాదాలు ఉన్నాయి. తన పొలంలో ఆ వ్యక్తి ట్రాక్టర్ ద్వారా దౌర్జన్యంగా దున్నడంతో అతన్ని ఎదుర్కొనే శక్తి లేక చిన్నసుంకన్న ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది.నాలుగురోజుల నుంచి బళ్లారి విమ్స్‌లోనే చికిత్స పొందుతున్నాడు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి

గుత్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ భవనంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్లు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ పెన్షనర్ అసోసియేషన్ నాయకులు కుళ్లాయిబాబు, రామ్మోహన్, నారాయణరెడ్డి, షేక్షావలి, శ్యాముల్, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి: జేసీపీఆర్


మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని నివాసంలో గురువారం ఆయ న తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాల ఎంఈఓలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగేలా చూసే బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పైన కూడా ఉందన్నారు. సమాజంలో ఎలా మెలగాలి అనే దానిపైన కూడా ఇప్పటి నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సభ్యత, సంస్కారం, క్రమశిక్షణ ఉంటే ఉద్యోగాలతో అవసరం లేదని, ఎక్కడైనా బతికేయవచ్చునని తెలిపారు. కనుక చిన్నప్పటి నుంచే వాటిపై పిల్లలకు అవగాహ న కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు ఉండేలా, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల భవనాలను ఎక్కువమంది అనుమతి లేకుండా నిర్మిస్తున్నారని, ఏదైనా జరిగితే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ పర్మిషన్ ఉండేటట్లు చూడాలన్నారు. ఎంఈఓలు నాగరాజు, రామగోవిందరెడ్డి, కాశప్ప, శ్రీదేవి, ధనలక్ష్మి, గురుప్రసాద్, ఓబులపతి, రాముడు పాల్గొన్నారు.